పత్రికాప్రకటన కాకినాడ, 12.12.2018

జిల్లాలో మౌళిక సదుపాయాలతో పాటు క్రీడావసతులు, ఆహ్లాదకర ఆకర్షణల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత నిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు.

బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర శాసన మండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం కాకినాడ రూరల్ నియోజక వర్గం పరిథిలో పలు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో వారితో పాటు జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యన్నారాయణ మూర్తి, కాకినాడ నగర మేయర్ సుంకర పావని పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ స్టేడియం ప్రారంభోత్సవం :

కార్యక్రమాల్లో తొలుత స్థానిక జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రాంగణంలో 2 కోట్ల 80 లక్షలు శాప్ నిధులతో నూతనంగా నిర్మించిన జిమ్నాస్టిక్స్ ఇండోర్ స్టేడియంను శాసన మండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం, క్రీడావసతులను మంత్రి చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం జిమ్నాస్టిక్స్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ప్రదర్శించిన విన్యాసాలను తిలకించి, బాలబాలికలను అభినందించి, నూతనంగా అందుబాటులోకి వచ్చిన వసతులతో తమ నైపుణ్యాలను పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ సిఈఓ ఎస్.మల్లిబాబు, శాప్ డైరక్టర్ యర్రా వేణుగోపాల రాయుడు, జిల్లాల జిమ్నాస్టిక్స్ సంఘం ఉపాధ్యక్షులు శ్రీరామరాజు, ఒలంపిక్ సంఘం కార్యదర్శి పద్మనాభం, ఛీఫ్ కోచ్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇదే కార్యక్రమంలో జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ క్రింద ఎంపికైన 25 మందిలో 15 మందికి దివ్యాంగులకు నియామక పత్రాలను ఉపముఖ్యమంత్రి చినరాజప్ప పంపిణీ చేశారు.

స్త్రీ శక్తి భవనం ప్రారంభోత్సవం :

అనంతరం నగర 2వ డివిజన్, కృష్ణానగర్ బ్యాంకు కాలనీలో 49 లక్షలు కార్పొరేషన్ సాధారణ నిధులతో నిర్మించిన స్త్రీ శక్తి భవనాన్ని ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ భవనం స్వయం సహాయ సంఘాల మహిళలు ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహించుకునే కామన్ ఫెసిలిటీ కేంద్రంగాను, కాలనీలో అధికంగా నివశిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు సేవా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకునేందకు ఉపయోగపడేలా నిర్మించినందుకు ఎమ్మెల్యేను, ఇంజనీర్లను ఆయన ఆభినందించారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని డిఆర్‌డిఏ, మెప్మా అధికారులకు మంత్రి సూచించారు.

పంచతంత్ర థీమ్ పార్క్ శంకుస్థాపనః

తదుపరి 3వ డివిజన్, వెంకటనగర్‌లో స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద 36 లక్షల అంచనాతో ప్రతిపాదించిన పంచతంత్ర థీమ్ పార్క్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ ద్వారా నగరంలోని ప్రధాన రహదార్ల విస్తరణ, సుందరీకరణ శరవేగంగా జరుగుతోందని, అలాగే నగర ప్రజలు, ముఖ్యంగా పిల్లల ఆడవిడుపు, వ్యాహ్యాళి కొరకు వివిధ డివిజన్లలో పార్కుల అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం అదే డివిజన్‌లో అభివృద్ధి చేస్తున్న ఓపెన్ ఎయిర్ జిమ్ పార్క్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.

శిల్పారామం ప్రారంభోత్సవం :

అనంతరం ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, మండలి ఉపాధ్యాక్షులు రెడ్డి సుబ్రమణ్యం వాకలపూడి బీచ్‌లో కేంద్ర జౌళి శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన 3 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన శిల్పారామం (అర్బన్ హాట్) ను ప్రారంభించి, ఆరామ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన ఉడెన్ క్రాఫ్ట్, తోలుబొమ్మలు, హెర్బల్ ఉత్పత్తులు, సిల్క్‌త్రెడ్, లేస్, జూట్, తుంగ ఉత్పత్తులు, బొటిక్ ఆర్ట్స్, కళంకారీ, పికిల్స్, డెకొరేటివ్ క్రాఫ్ట్ విక్రయ, ప్రదర్శన శాలల్లోని వివిధ హస్త కళాఉత్పత్తులను ఉత్పత్తుల స్టాళ్లను తిలకించారు. అలాగే శిల్పారామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను, సమీపంలో ఆధునీకరిస్తున్న రిసార్ట్స్ వసతులను జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రావారికి వివరించారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ కనుమరుగౌతున్న ప్రాచీన కళలు, హస్తకళలలను పరిరక్షించి రాబోవు తరాలకు వారసత్వంగా అందిచాల్సి ఉందని, ఇందుకు రాష్ట్ర ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ద్వారా 13 జిల్లాల్లో శిల్పారామ ఉద్యాన వనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాఖపట్నం, తిరుపతి, కడప, పులివెందుల, అనంతపురం, పుట్టపట్టపర్తి, విజయనగరం, కాకినాడలలో 8 శిల్పారామాలు ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో 25 ఎకరాల్లో మహా శిల్పారామం నిర్మాణానికి నమూనాల రూపకల్పన ప్రక్రియ జరుగుతోందన్నారు. హస్తకళలకు ప్రచుర్యం కల్పించడంతో పాటు దళారి వ్యవస్థ లేకుండా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించేందుకు ఇవి దోహదం చేస్తున్నాయన్నారు. హస్తకళాకారులు ప్రజాదరణ పొందిన సాంప్రదాయ కళాత్మక ఉత్పత్తులను కొనసాగిస్తూనే, ఆధునిక అభిరుచులకనుగుణంగా వినూత్నత జోడించి కొత్త ఉత్పత్తులు చేపట్టాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో శిల్పారామం సిఈఓ బి.జయరాజు, టిటిడి బోర్డు మెంబరు దొక్కా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)